సాక్షి
యాదాద్రి భువనగిరి
శుక్రవారం, 22, ఆగస్టు, 2025



వచ్చే నెలలో చేనేత రుణమాఫీ
వచ్చే నెలలో చేనేత రుణమాఫీ డబ్బులు జమ వుతాయని రాష్ట్ర చేనేత, జౌళిశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్ అన్నారు. - 8లో



మిత్రుడి కోసం..
చదువు కోసం వెళ్లి కాలిఫోర్నియాలో స్థిర పడిన వ్యక్తి 30 ఏళ్ల తర్వాత స్నేహితుడిని కలిసేందుకు కోదాడకు వచ్చాడు. - 8లో



అందని ఇందిరమ్మ బిల్లులు
సాంకేతిక సమస్యలు, అధికారుల నిర్లక్ష్యంతో ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారు లకు బిల్లులు అందడం లేదు. - 9లో

న్యూస్‌రీల్

ఉపాధ్యాయుల పదోన్నతుల రీషెడ్యూల్ విడుదల

భువనగిరి: ఉపాధ్యాయుల పదోన్నతులకు సంబంధించిన రీ షెడ్యూల్‌ను రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ శుక్రవారం విడుదల చేసింది. ఉపాధ్యాయులకు సంబంధించిన పదోన్నతుల ప్రక్రియ మొదటగా ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం ఈనెల 11న పూర్తికావాల్సి ఉంది. 2002 నవంబర్‌లో పదోన్నతులు పొందిన ఉపాధ్యాయులు సీనియార్టీ విషయంలో కోర్టులో పిటిషన్ వేసిన కారణంగా పదోన్నతుల ప్రక్రియ వాయిదా పడింది. ఈ పిటిషన్‌ను కోర్టు కొట్టివేసిన కారణంగా తిరిగి ఉపాధ్యాయుల పదోన్నతులకు సంబంధించి రీ షెడ్యూల్‌ను ప్రకటించింది. దీంతో పాటు వెంటనే మల్టీజోన్–2 పరిధిలో జరిగే జీహెచ్‌ఎంల పదోన్నతుల జాబితాను ప్రకటించింది. ఈమేరకు జిల్లాలో ఖాళీగా ఉన్న 34 జీహెచ్‌ఎం పోస్టులు పదోన్నతుల ద్వారా భర్తీ కానున్నాయి. అనంతరం జిల్లాలో సుమారు 100 వరకు స్కూల్ అసిస్టెంట్లు, పీఎస్‌హెచ్‌ఎంలకు సంబంధించి పదోన్నతుల ప్రక్రియ చేపట్టనున్నారు. ఇప్పటికే తయారు చేసిన సుమారు 300 మది సీనియార్టీలకు సంబంధించిన సర్టిఫికెట్స్ పరిశీలన, అభ్యంతరాల స్వీకరణ ప్రక్రియ రీషెడ్యూల్ ప్రకారం ఈ నెల 24 వరకు జరగనుంది. ఈ నెల 25న వెబ్ ఆప్షన్, పదోన్నతులు పొందిన వారికి 26న ఆర్డర్లు జారీ చేయనున్నారు. జీహెచ్‌ఎంల పదోన్నతులకు సంబంధించి కూడా ఆర్డర్లు జారీ చేశారు.

యూరియా కోసం ఆందోళన చెందొద్దు



ఆలేరు ఫర్టిలైజర్ దుకాణంలో యూరియాను పరిశీలిస్తున్న జిల్లా అధికారి శోభారాణి

ఆలేరురూరల్: యూరియా కోసం రైతులు ఆందోళన చెందొద్దని జిల్లా ముఖ్య కార్యనిర్వహణాధికారి శోభారాణి అన్నారు. గురువారం ఆలేరు పట్టణంలోని ఫర్టిలైజర్ దుకాణాలను ఆమె తనిఖీ చేశారు. ఇప్పటివరకు జిల్లాకు 17వేల మెట్రిక్ టన్నుల యూరియా వచ్చిందని తెలిపారు. దుకాణ యాజమానులు రైతులకు అవసరం ఉన్న ఎరువులు ఇవ్వాలని, వేరే వాటిని అంటకట్టొద్దన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే ఎరువులు అమ్మాలని, ఎక్కువ ధరలకు అమ్మితే చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం మందనపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించారు. ఆమె వెంట ఎంపీడీఓ సత్యాంజనేయ ప్రసాద్, ఎంపీఓ అనురాధ, ఏఓ శ్రీనివాస్, ఏఈఓ మండల అధికారులు తదితరులున్నారు.

బంగారు భవిష్యత్‌ను నిర్మించుకోవాలి



వంటగదిని పరిశీలిస్తున్న గురుకుల విద్యాలయ సంస్థ ప్రధాన కార్యదర్శి

చౌటుప్పల్ : విద్యార్థులు చక్కటి విద్యాభ్యాసంతో బంగారు భవిష్యత్‌ను నిర్మించుకోవాలని రాష్ట్ర గురుకుల విద్యాలయ సంస్థ ప్రధాన కార్యదర్శి రమణకుమార్ అన్నారు. చౌటుప్పల్ పట్టణ కేంద్రంలోని తెలంగాణ బాలికల గురుకుల పాఠశాల, కళాశాలను గురువారం ఆయన సందర్శించారు. తరగతి గదులు, వంటశాల, హాస్టల్ భవనం, గురుకుల పరిసరాలను పరిశీలించారు. అనంతరం ఉపాధ్యాయులతో సమీక్ష నిర్వహించారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు లక్ష్యంతో చదువుకుంటే భవిష్యత్‌లో ఉన్నత స్థాయిలో ఉండొచ్చన్నారు. ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని బోధించడం ద్వారా చక్కటి ఫలితాలు ఉంటాయన్నారు. ఆయన వెంట ప్రిన్సిపాల్ స్మిత, ఉపాధ్యాయులు ఉన్నారు.

ఉత్సవం.. సన్నద్ధం



గణేష్ నవరాత్రి ఉత్సవాల సన్నద్ధతపై అధికారులతో సమావేశం నిర్వహిస్తున్న కలెక్టర్ హనుమంతరావు

- గణేష్ నవరాత్రి ఉత్సవాలు శాంతియుతంగా జరిగేలా ప్రణాళిక
- ప్రతి మండపానికి అనుమతి తప్పనిసరి
- రాత్రి పది గంటల లోపు మైక్‌లు కట్టేయాలి
- మండపాలను విజిట్ చేయనున్న పోలీసులు, పెట్రో మొబైల్ కానిస్టేబుళ్లు
- డీడీ చెల్లిస్తే మండపాలకు విద్యుత్‌పోల్ నుంచి కనెక్షన్

సాక్షి, యాదాద్రి : గణేష్ నవరాత్రి ఉత్సవాలు, విగ్రహాల నిమజ్జనం కోసం జిల్లా యంత్రాంగం సమాయత్తం అవుతోంది. శాంతియుత వాతావరణంలో ఉత్సవాలు జరగడానికి పలు జాగ్రత్తలు రూపొందించారు. ఈనెల 27న వినాయక చవితి పండుగ రోజు నుంచి వచ్చేనెల 6వ తేదీ వరకు గణేష్ నవరాత్రి ఉత్సవాలు జరగనున్నాయి. భువనగిరి, యాదగిరిగుట్ట, చౌటుప్పల్ సబ్ డివిజన్ పరిధిలో గల ఆరు మున్సిపాలిటీలు, 17 మండలాల్లో ఈసారి సుమారు నాలుగు వేల వినాయక మండపాలు ఏర్పాటు చేసే అవకాశం ఉంది. గత సంవత్సరం 3,600కు పైగా మండపాలు ఏర్పాటు చేశారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ఈసారి ఈ సంఖ్య పెరిగే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు.

వివిధ శాఖల సమన్వయంతో..

విద్యుత్ శాఖ, నీటిపారుదల, ఆర్‌అండ్‌బీ పంచాయతీ రాజ్, మత్స్యశాఖ, అగ్నిమాపక శాఖ, మున్సిపాలిటీ, గ్రామపంచాయతీ అధికారులందరినీ సమన్వయం చేస్తున్నారు. శోభాయాత్రకు అడ్డంకిగా రహదారుల వెంట ఉండే చెట్ల కొమ్మలను తొలగించడం, రోడ్లకు మరమ్మతులు వంటి పనులు యుద్ధప్రాతిపదికన చేపడుతున్నారు.

తాత్కాలిక విద్యుత్ కనెక్షన్

ప్రతి మండపం నిర్వాహకులు డీడీ చెల్లిస్తే విద్యుత్ శాఖ సిబ్బంది కరెంట్ పోల్ నుంచి తాత్కాలిక విద్యుత్ కనెక్షన్ ఇస్తారు. అనుకోని పరిస్థితిలో ప్రమాదం జరిగితే విద్యుత్ శాఖ నుంచి పరిహారం అందుతుంది. ఇందుకోసం 250 కిలో వాట్స్‌కు రూ.500, 500కిలో వాట్స్‌కు రూ.1000, 1000 కిలో వాట్స్ వరకు రూ.1500తోపాటు ప్రతి కిలోవాట్స్‌కు రూ.750 చెల్లించాలి. శోభాయాత్ర కొనసాగే ప్రాంతాల్లో రోడ్లకు ఇరువైపులా కిందికి వేలాడే కరెంటు తీగలు, వంగి ఉన్న చెట్ల కొమ్మలు ఉంటే తొలగించనున్నారు. అయితే విగ్రహాల ఎత్తు సమాచారం ముందుగానే తీసుకుంటారు.

అందుబాటులో గజ ఈతగాళ్లు

వినాయక నిమజ్జనోత్సవం కోసం చెరువుల వద్ద గజఈత గాళ్లను అందుబాటులో ఉంచుతున్నారు. క్రేన్, లైటింగ్ వ్యవస్థ, అత్యవసర వైద్యం, తాగు నీరు, బారికేడ్లు, ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, పారిశుద్ధ్యం వంటి చర్యలు ఆయా శాఖలు చేపట్టనున్నాయి. ప్యాచ్ వర్క్ చేపట్టి రోడ్లపై ఏర్పడిన గుంతలను మూసివేయాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. చెరువుల వద్ద సరిపడా సంఖ్యలో క్రేన్‌లను ఏర్పాటు చేసి ప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు ఏర్పాటు చేస్తున్నారు. అగ్నిమాపక శాఖ అధికారులు, సిబ్బందిని అప్రమత్తం చేశారు. విగ్రహాల నిమజ్జనం పూర్తయ్యే వరకు అధికారులు పర్యవేక్షణ కొనసాగనుంది.

చెరువుల వద్ద భద్రత ఏర్పాట్లు

ప్రతి మండపానికి అనుమతి తప్పనిసరి. ఇందుకోసం poiceportal.tspoice.gov.in లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. పోలీసులు ఇచ్చిన అనుమతి కాపీని మండపంలో కనిపించే విధంగా ప్రదర్శించాలి. ప్రతి మండపాన్ని జియో ట్యాగింగ్ చేయనున్నారు. డీజేలకు అనుమతి లేదు. అనుమతి ఇచ్చిన మేరకు రాత్రి పది గంటల లోపు మైక్‌లు కట్టేయాలి. ప్రతిరోజు ప్రతి మండపాన్ని బ్లూకోట్స్ పోలీస్‌లు, పెట్రో మొబైల్ కానిస్టేబుళ్లు విజిట్ చేస్తారు. అక్కడ సమస్యలు ఏమైనా ఉన్నాయా అని తెలుసుకుని పరిష్కరిస్తారు. మండపాల వద్ద ఫైర్ సేఫ్టీ నిబంధనలు పాటించాలి. నిమజ్జనానికి అవసరమైన రూట్‌మ్యాప్‌ను ముందుగానే పోలీస్ శాఖకు అందివ్వాలి. నిమజ్జనం కోసం భువనగిరి పెద్ద చెరువు, బీబీనగర్ చెరువు, యాదగిరిగుట్ట, గోధుమకుంట, చౌటుప్పల్ చెరువులతో పాటు స్థానిక చెరువుల వద్ద భద్రతా ఏర్పాటు చేస్తున్నారు.



ప్రజలు సహకరించాలి



గణేష్ నవరాత్రులు, నిమజ్జనం సందర్భంగా ప్రజలు సహకరించాలి. ఎక్కడైనా ఏదైనా సమస్య తలెత్తితే వెంటనే పోలీసుల దృష్టికి తీసుకురావాలి. ఉత్సవాలు ప్రశాంతంగా జరిగేందుకు అన్నివర్గాల ప్రజలు సహకరించాలి. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేస్తాం. నిమజ్జనం చేసే ముందు పోలీసులకు సమాచారం ఇస్తే ఏర్పాట్లు చేస్తారు.

– అక్షాంశ్ యాదవ్, డీసీపీ

ప్రతి మండపాన్ని విద్యుత్ అధికారులు సందర్శిస్తారు



ప్రతి మండపానికి ఒక లైన్ ఇన్‌స్పెక్టర్, ఒక లైన్‌మన్‌తోపాటు ఇద్దరు ఆర్టిజన్ సిబ్బందిని బాధ్యులను చేశాం. ప్రతిరోజు విద్యుత్ అధికారులు మండపాన్ని సందర్శించాలి. డీడీ చెల్లిస్తే విద్యుత్‌పోల్ నుంచి కనెక్షన్ ఇస్తాం. ఏదైనా ప్రమాదం జరిగితే వెంటనే ట్రిప్ అయి ప్రమాదం జరగకుండా ఎంసీబీ ఏర్పాటు చేస్తాం.

– సుధీర్‌కుమార్, ట్రాన్స్‌కో ఎస్‌ఈ

ఉత్సవాలను శాంతియుతంగా నిర్వహించుకోవాలి

గణేష్ ఉత్సవాలు, మిలాద్– ఉన్– నబీ వేడుకలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని కలెక్టర్ హనుమంతరావు తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లో పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు. గణేష్ మండలి ప్రతినిధులు, శాంతి కమిటీ సభ్యులు, ముస్లిం మతపెద్దలు, మండపాల నిర్వాహకులు తమ అభిప్రాయాలు వెల్లడించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో డీసీపీ అక్షాంశ్ యాదవ్, ఏఎస్పీ రాహుల్ రెడ్డి, రెవెన్యూ అదనపు కలెక్టర్లు వీరారెడ్డి, భాస్కరరావు, గ్రంథాలయ చైర్మన్ అవేజ్ చిస్తీ, రెవెన్యూ డివిజనల్ అధికారి మాలి కృష్ణారెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి జయమ్మ, డీఆర్‌డీఓ నాగిరెడ్డి, ఏసీపీలు పటోళ్ల మధుసూదన్‌రెడ్డి, శ్రీనివాస్ నాయుడు, తహసీల్దార్‌లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సాంకేతిక నైపుణ్యం.. ఉపాధి మార్గం

- ఆలేరు, భువనగిరిలో అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లు సిద్ధం
- అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో ల్యాబ్‌ల ఏర్పాటు
- శిక్షణ తర్వాత ఉద్యోగాలకు మల్టీనేషనల్ కంపెనీలతో ఒప్పందం
- వచ్చే నెలలో ప్రారంభానికి ఏర్పాట్లు



ఆలేరులోని ఐటీఐ ఆవరణలో నిర్మించిన ఏటీసీ

ఆలేరు: గ్రామీణ యువతలో శిక్షణ నైపుణ్యాలు పెంపొందించి వారికి ఉపాధి అవకాశాలను కల్పించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఆలేరు, భువనగిరిలో అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్ (ఏటీసీ)ల నిర్మాణాలు చేపట్టింది. ఆలేరులోని పారిశ్రామిక శిక్షణ సంస్థ(ఐటీఐ)ఆవరణలో, భువనగిరిలో మిషన్ భగీరథ కార్యాలయం సమీపంలో ఒక్కొక్కటి 13వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో గతేడాది ఈ పనులు మొదలుపెట్టారు. ఒక్కో ఏటీసీ నిర్మాణానికి రూ.35కోట్ల చొప్పున మొత్తం రూ.70కోట్ల నిధులతో నిర్మించారు. ఇందులో 85శాతం నిధులను టాటా టెక్నాలజీస్ లిమిటెడ్(టీటీఎల్)సమకూర్చగా, ఏటీసీల నిర్మాణం, విద్యుదీకరణ తదితర పనులకు మిగతా 15శాతం నిధులను ప్రభుత్వం వ్యయం చేసింది. ప్రస్తుతం నిర్మాణ పనులు పూర్తి కావడంతో వచ్చే నెలలో వీటిని ప్రారంభించనున్నారు. ఈమేరకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

రెండు సెంటర్లలో 344 సీట్లు

ఏడాది, రెండేళ్ల కాలపరిమితికిగాను అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ కోర్సుల్లో ఒక్కో సెంటర్లో 172 సీట్ల చొప్పున 344 సీట్లు ఉన్నాయి. ఏటీసీల్లో లక్ష్యం మేరకు ప్రవేశాల పూర్తికి కలెక్టర్ హనుమంతరావు ప్రత్యేక చొరవ చూపుతున్నారు. ఈ విషయమై దృష్టిసారించాలని జిల్లా యంత్రాంగానికి కలెక్టర్ ఆదేశించారు. ఇప్పటికే ఆలేరులో 64, భువనగిరిలో 72 అడ్మిషన్లు జరిగాయి. ప్రవేశాల కోసం దరఖాస్తులు సమర్పించేందుకు ఈనెల 28తో గడువు ముగియనుంది.

పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థులు అర్హులు

పదో తరగతి పాసై, 22ఏళ్లలోపు ఉన్న విద్యార్థులు హెచ్‌టీటీపీఎస్//ఐటీఐ.తెలంగాణ.జీటీవీ.ఇన్ వెబ్‌సైట్ ద్వారా విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తు చేసుకున్న తర్వాత పదో తరగతి మెమో, కుల ధ్రువీకరణ పత్రం, బోనఫైడ్ సర్టిఫికెట్, టీసీతోపాటు ఆధార్‌కార్డు ఒరిజినల్ ధ్రువపత్రాలతో స్థానిక ఐటీఐ కళాశాలల్లో సంప్రదించాలి.

కోర్సులు, సీట్ల వివరాలు (కాలపరిమితి ఏడాది)

కోర్సు	సీట్లు
మానుఫ్యాక్చరింగ్ ప్రాసెస్ కంట్రోల్ ఆటోమేషన్ ఇండస్ట్రియల్ రోబోటిక్స్, డిజిటల్	40
మ్యానుఫ్యాక్చరింగ్ టెక్నీషియన్	40
ఆర్టీసియన్ యూజింగ్ అడ్వాన్స్‌డ్ టూల్స్	20
బేసిక్ డిజైనర్, వర్చువల్ వెరిఫయర్(మెకానికల్)	24
అడ్వాన్స్‌డ్ సీఎన్‌సీ మిషనింగ్ టెక్నీషియన్	24
మెకానిక్ ఎలక్ట్రిక్ వెహికల్స్	24

నేషనల్, మల్టీనేషనల్ కంపెనీలతో ఒప్పందం

ఏటీసీల్లో సంవత్సరం, రెండేళ్ల కోర్సుల్లో శిక్షణ ఇవ్వనున్నారు. శిక్షణ అనంతరం విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు టాటా, టాటా నెల్కో, టెక్ ఎక్స్‌పర్ట్, డెల్, ఇన్ఫోసిస్ తదితర నేషనల్, మల్టీనేషనల్ కంపెనీలతో ప్రభుత్వం ఒప్పందం చేసుకుంది. మరికొన్ని ప్రభుత్వ, ప్రైవేట్ రంగ సంస్థలతో అధికారులు చర్చలు చేస్తున్నారు. అదేవిధంగా 'టీగేట్' (తెలంగాణ గేట్‌వే అడాప్ట్ ట్రైనింగ్ ఎంప్లాయిమెంట్) వివిధ పారిశ్రామికవేత్తలతో శిక్షణ పొందిన విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు కల్పించే విషయమై చర్యలు జరుపుతోంది. పరిశ్రమలకు అవసరాలకు అనుగుణంగా ఏటీసీల్లో విద్యార్థులకు శిక్షణ ఇచ్చేలా టీగేట్ చర్యలు తీసుకుంటుంది.



ఏటీసీలో బిగించనున్న పరికరాలు

అధునాతన సాఫ్ట్‌వేర్ పరికరాలు వచ్చాయి



ఆలేరు, భువనగిరిలోని ఏటీసీల్లో శిక్షణ కోసం అన్ని ఆధునాతన సాఫ్ట్‌వేర్ పరికరాలు వచ్చాయి. విద్యార్థులకు వివిధ కోర్సుల్లో శిక్షణ, సిలబస్ బోధించేందుకు ఎనిమిది మంది ప్రత్యేక నిపుణులను టీటీఎల్ నియమించింది. ఆయా యంత్రాలను ఏటీసీల్లో సాంకేతిక బృందం బిగిస్తోంది.

– హరికృష్ణ, ఐటీఐ జిల్లా కన్వీనర్

స్థిరపడే వరకు అండగా ఉంటా

- కలెక్టర్ హనుమంతరావు



భరత్‌చంద్రచారికి నిత్యావసర సరుకులు అందజేస్తున్న కలెక్టర్ హనుమంతరావు

సంస్థాన్ నారాయణపురం: మండలంలోని శేరిగూడేనికి చెందిన విద్యార్థి భరత్‌చంద్రచారికి ఇచ్చిన హామీ మేరకు కలెక్టర్ హనుమంతరావు గురువారం అతడి ఇంటిని సందర్శించారు. విద్యార్థి కుటుంబానికి రూ.5వేలు నగదు, నెలకు సరిపడా నిత్యావసర సరుకులు అందజేశారు. ఇంటర్ ఎలా చదువుతున్నావని ఆరా తీశారు. ఉన్నత చదువులు చదివి, కుటుంబానికి మంచి పేరు తీసుకురావాలన్నారు. ఏ అవసరం వచ్చిన తన దృష్టికి తీసుకురావాలని చెప్పారు. చదువు విషయంలో ఎలాంటి సాయం చేయడానికైనా సిద్ధంగా ఉన్నానని తెలిపారు. భవిష్యత్‌లో స్థిరపడే వరకు అండగా ఉంటానని పేర్కొన్నారు. విద్యార్థి బలహీనంగా ఉండటంతో మండల వైద్యాధికారికి ఫోన్ చేసి అతడికి రక్త పరీక్షలు నిర్వహించి, తగిన వైద్యం అందించాలని సూచించారు. ఇందిరమ్మ ఇంటి నిర్మాణం కోసం స్థల పరిశీలన చేసి, నిర్మాణం పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కాగా.. గ్రామస్తులు బస్సు లేదని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా, నల్లగొండ డీఎంతో మాట్లాడి బస్సు ఏర్పాటు చేయాలని సూచించారు. అంతకుముందు చిమిర్యాల గ్రామంలో ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించారు. ఆయన వెంట ఆర్డీఓ శేఖర్‌రెడ్డి, తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీడీఓ ప్రమోద్‌కుమార్, ఎంపీఓ నర్సింహారావు తదితరులున్నారు.

ప్రభుత్వ విద్యను బలోపేతం చేయాలి



స్టడీ మెటీరియల్ పరిశీలిస్తున్న జానీ అఫ్గాన్

బొమ్మలరామారం: ప్రాథమిక స్థాయి నుంచి ప్రభుత్వ విద్యను బలోపేతం చేయాలని జిల్లా అకాడమిక్ మానిటరింగ్ అధికారి జానీ అఫ్గాన్ అన్నారు. బొమ్మలరామారం మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్‌లో గురువారం నిర్వహించిన మండల స్థాయి టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్ అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ప్రాథమిక పాఠశాలల్లో చదివే విద్యార్థులకు విద్య సులభంగా అర్థమయ్యే రీతిలో బోధిస్తే మెరుగైన ఫలితాలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో సీఎంవో లింగారెడ్డి, ఎంపీడీఓ రాజా త్రివిక్రమ్, ఎంఈఓ రోజారాణి, పీఈటీ నర్సింహ పాల్గొన్నారు.

ఇంకుడు గుంతలు మరిచారు!

- మంజూరైనవి 1,764.. నిర్మాణం పూర్తయినవి12
- వానాకాలానికి ముందే పూర్తిచేయాల్సి ఉండగా నీరుగారుతున్న లక్ష్యం

ఆలేరురూరల్: వర్షపు నీటిని ఒడిసిపట్టి భూగర్భ జలాల వృద్ధికి ప్రభుత్వం చొరవ చూపుతున్నా క్షేత్ర స్థాయిలో ఆ దిశగా చర్యలు కనిపించడం లేదు. వర్షాకాలానికి ముందే ఇంకుడు గుంతల తవ్వకాలు పూర్తి చేయాలని ఆదేశాలున్నా ఆచరణలో పెట్టడం లేదు. 2024–25 ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకు కేవలం 12 ఇంకుడు గుంతల నిర్మాణాలే పూర్తవడం అందుకు నిదర్శనం. ప్రజలకు అవగాహన కల్పించడంలో అధికారులు విఫలమయ్యారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

1,764 ఇంకుడు గుంతలు మంజూరు

ఉపాధిహామీ పథకం కింద 2024–25 ఆర్థిక సంవత్సరానికి గాను జిల్లాకు 1,764 ఇంకుడు గుంతలు మంజూరయ్యాయి. ఇందులో కేవలం 12 గుంతలు మాత్రమే పూర్తి కాగా.. 87 ఇంకుడు గుంతలు పురోగతిలో ఉన్నాయి. మిగతావి పనులు మొదలుకాలేదు. ఇంకుడు గుంతల నిర్మాణానికి రూ.1.05 కోట్లు ఖర్చు చేయాలని లక్ష్యంగా నిర్దేశించగా.. ఇప్పటి వరకు రూ.74,400 ఖర్చు చేశారు. ఒక్కో ఇంకుడు గంతకు ప్రభుత్వం రూ.6,200 చెల్లిస్తుంది.

ఇంకుడు గుంతల వివరాలు

మంజూరైనవి :	1764
పురోగతిలో ఉన్నవి :	287
పూర్తయినవి :	12
ఒక్కో ఇంకుడు గుంతకు చెల్లిస్తుంది :	రూ.6,200
జిల్లాలో గృహాలు :	1,59,745

వృథా అవుతున్న వర్షపు నీరు

వర్షపు నీటిని భూమిలోనికి ఇంకించేందుకు అవసరమైన రీచార్జి ఫిట్స్ తగినన్ని లేకపోవడంతో భూగర్భ జలనిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో 7,39,448 జనాభా ఉండగా, చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో 1,80,677 కుటుంబాలు ఉన్నాయి. జిల్లాలో 3,082 చదరపు కిలోమీటర్ల భౌగోళిక విస్తీర్ణం ఉండగా ఏటా 2,31,150 కోట్ల లీటర్ల వర్షం కురుస్తుంది. ఈ నీళ్లన్నీ భూమిలో దాచుకుంటే ఒక్కొక్కరికి రోజుకు 4000 లీటర్లు అందుబాటులో ఉంటాయి. ఇళ్ల పైకప్పులపై, ఆవరణలో కురిసే వర్షాన్ని నేలలోకి ఇంకింపజేస్తే నీటి కరువే ఉండదని నిపుణుల అభిప్రాయం.



ఆలేరు మండలం మందనపల్లిలో ఇంటి ముందు తీసిన ఇంకుడు గుంత

ఇంకుడు గుంతల నిర్మాణం ఇలా..

ఇంకుడు గుంత 1.2 మీటర్ల పొడవు, 1.2 మీటర్ల వెడల్పు 1.8 మీటర్ల లోతు ఉండాలి. అడుగు భాగంలో ఫీటున్నర మందం రాళ్లు, దానిపై ఫీటున్నర 40 ఎంఎం కంకర, వాటిపైన 3ఫీట్ల రింగ్ అమర్చాలి. దానిపై మూత ఏర్పాటు చేసి ఐదు మీటర్ల పైపును బిగించాలి. ఇరుపక్కల 20ఎంఎం కంకర నింపాలి. వర్షం కురిసినప్పుడు ఇతర సమయంలో వృథాగా పోయే నీటిని ఇంకుడు గుంతలోకి మళ్లించాలి.

అవగాహనలో అధికారుల నిర్లక్ష్యం

ఇంకుడు గుంతల వల్ల భూగర్భ జల సంరక్షణ ఏవిధంగా సాధ్యమవుతుందో ప్రజలకు వివరించేందుకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాల్సి ఉండగా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకుంటే ఇంటి నిర్మాణానికి అనుమతులు ఇస్తామని కచ్చితమైన ఆదేశాలు జారీ చేయాలి. గతంలో నిర్మించిన ఇంకుడు గుంతలు శుభ్రం చేయడంతో పాటు లేని ఇళ్లలో కొత్తవి నిర్మించి వాన నీరు ఇంకేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

అవగాహన కల్పిస్తున్నాం



ఉపాధిహామీ పథకంలో జలసంరక్షణ పనులు చేపడుతున్నాం. ఇందులో భాగంగా ఇళ్లలో ఇంకుడు గుంతలు, గొట్టపు బావుల చుట్టూ నీటిని రిచార్జి చేసే కందకాల నిర్మాణం చేసుకునే అవకాశం ప్రభుత్వం కల్పించింది. వీటిపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. అవసరమైనవారు పంచాయతీ కార్యదర్శులను సంప్రదించవచ్చు.

– నాగిరెడ్డి, డీఆర్‌డీఓ

యాదగిరీశుడికి సువర్ణ పుష్పార్చన

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయ ముఖ మండపంలోని ఉత్సవ మూర్తులకు అర్చకులు సువర్ణ పుష్పార్చన, అష్టోత్తర పూజలు నిర్వహించారు. గురువారం ఉదయాన్నే క్షేత్రాన్ని తెరిచిన అర్చకులు శ్రీస్వామి అమ్మవార్లకు సుప్రభాతం జరిపించారు. అనంతరం స్వయంభూ, ప్రతిష్టా అలంకారమూర్తులకు నిజాభిషేకం, తులసీ దళాలతో అర్చన చేపట్టారు. ఇక ఆలయంలో శ్రీసుదర్శన నారసింహ హోమం, గజ వాహన సేవ, నిత్య కల్యాణం, బ్రహ్మోత్సవం వంటి కైంకర్యాలు నిర్వహించారు. ముఖ మండపంలో సువర్ణ పుష్పార్చన మూర్తులకు అష్టోత్తర పూజలు జరిపించారు. వివిధ పూజల్లో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.

ఆలయ ముఖ మండపంలో సువర్ణ పుష్పార్చన పూజలు చేసి హారతినిస్తున్న అర్చకుడు →



తరాలు మారినా కళాకారుల స్వరాలు మారవు

- ఎమ్మెల్సీ, ప్రజా వాగ్గేయకారుడు గోరటి వెంకన్న

రామన్నపేట: తరాలు మారినా ప్రజల పక్షాన నిలిచే కళాకారుల స్వరాలు మారవని ఎమ్మెల్సీ, ప్రజా వాగ్గేయకారుడు గోరటి వెంకన్న అన్నారు. గురువారం రామన్నపేట పాత బస్టాండ్ ఆవరణలో ప్రజానాట్యమండలి ఆధ్వర్యంలో నిర్వహించిన వీధి నాటకోత్సవాలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కళలు, కళాకారులు ఎల్లప్పుడు ప్రజల పక్షానే నిలబడాలన్నారు. నిజాం రాజులను ఎదురించిన సుద్దాల హన్మంత్ నడయాడిన రామన్నపేట కళాకారుల జాతరలతో పునీతమైందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన కళాకారులు 'అది నాదే.. ఇది నాదే', ఆడపిల్ల ఒగ్గుకథ, రైతు బతుకు, హరే రామ హరే రామ అనే నాటకాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో ప్రజా నాట్యమండలి రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు వేముల ఆనంద్, కట్ట నర్సింహ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు అవ్వారి గోవర్ధన్, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు గంటిపాక శివకుమార్, ఈర్లపల్లి ముత్యాలు, దేశపాక రవి, కుమ్మరి శంకర్ పాల్గొన్నారు.

రామన్నపేటలో నిర్వహించిన వీధి నాటకోత్సవాల్లో ఆడుతూ పాడుతూ ఉత్సాహ పరుస్తున్న గోరటి వెంకన్న →



క్లుప్తంగా

ఎంజీయూలో అధ్యాపకులకు శిక్షణ

నల్లగొండ టూటౌన్: మహాత్మాగాంధీ యూనివర్సిటీలో అధ్యాపకుల నైపుణ్యాలను పెంపొందించేందుకు గురువారం యూనివర్సిటీలో ఇన్ఫ్లిబ్ నెట్ సంస్థ ప్రతినిధి అర్షద్‌ఖాన్ శిక్షణ ఇచ్చారు. లెర్నింగ్ మేనేజ్‌మెంట్ సిస్టంపై ఆన్‌లైన్ కోర్సులు రూపొందించుట, విద్యా సంబంధిత విషయాలను విద్యార్థులకు అందుబాటులో ఉంచే విధానాలు, పరిశోధనలు, వాటి ప్రచురణలు తదితర అంశాలపై ఆన్‌లైన్ ద్వారా అవగాహన కల్పించారు. ఇన్ఫ్లిబ్ నెట్‌లో విశ్వవ్యాప్తంగా జరిగే అధునాతన పరిశోధనలు అందుబాటులోకి రావడం వలన అధ్యాపకులు తమ నైపుణ్యాలను మెరుగుపర్చుకుంటూ విద్యార్థులకు బోధించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంజీయూ రిజిస్ట్రార్ అలువాల రవి, మిర్యాల రమేష్, శ్వేత, శ్రీలక్ష్మి, వివిధ కళాశాలల ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి క్రికెట్ పోటీలకు ఎంపిక


పోలంపల్లి వసంత్‌గౌడ్

మునగాల: మునగాల మండలం ఆకుపాముల గ్రామానికి చెందిన పోలంపల్లి సురేష్‌గౌడ్, సుజాత దంపతుల కుమారుడు వసంత్‌గౌడ్ జాతీయ స్థాయి క్రికెట్ పోటీలకు ఎంపికయ్యాడు. వసంత్‌గౌడ్ నల్లగొండ జిల్లా పెద్దవూర మండలం చలకుర్తి గ్రామంలోని జవహర్ నవోదయ విద్యాలయంలో 8వ తరగతి చదువుతున్నాడు. ఇటీవల ఏపీలోని ఏలూరులో జరిగిన అండర్–14 హైదరాబాద్ రీజియన్ నవోదయ విద్యాసమితి క్రికెట్ సెలక్షన్స్‌లో వసంత్‌గౌడ్ పాల్గొని 15రోజుల రీజినల్ క్రికెట్ శిబిరానికి ఎంపికయ్యాడు. ఈ శిబిరంలో ఉత్తమ ప్రతిభ కనబరిచి ఈ నెల చివరి వారంలో హర్యానా రాష్ట్రంలో జరగనున్న నవోదయ క్రీడా సమితి జాతీయ స్థాయి అండర్–14 క్రికెట్ పోటీలకు ఎంపికయ్యాడు. తన తండ్రి సురేష్‌గౌడ్, కోదాడ క్రికెట్ అకాడమీ కోచ్ షేక్ సిద్దిక్ ప్రోత్సాహం, ఎస్‌వీఎస్ పాఠశాల, నల్లగొండ యాజమాన్యం సహకారంతో జాతీయ స్థాయికి ఎంపికైనట్లు వసంత్‌గౌడ్ పేర్కొన్నాడు. వసంత్‌గౌడ్ జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ కనబర్చాలని బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పోలంపల్లి సుధాకర్‌గౌడ్ ఆకాంక్షించారు.

వాగులో కొట్టుకుపోయి రైతు మృతి


రాంమూర్తి (ఫైల్)

నిడమనూరు: పొలానికి వెళ్తూ వాగులో కొట్టుకుపోయి రైతు మృతిచెందాడు. ఈ ఘటన నిడమనూరు మండలం సూరేపల్లి గ్రామంలో గురువారం వెలుగులోకి వచ్చింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. సూరేపల్లి గ్రామానికి చెందిన ఆవుల రాంమూర్తి(55) మంగళవారం సాయంత్రం తన వ్యవసాయ పొలానికి వెళ్తూ మార్గమధ్యలో హాలియా వాగులో కొట్టుకుపోయాడు. కుటుంబ సభ్యులు, గ్రామస్తులు అతడి ఆచూకీ కోసం గాలిస్తుండగా.. గురువారం వాగు వెంట చెట్ల పొదల్లో రాంమూర్తి మృతదేహం లభ్యమైంది. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించారు.

గుండెపోటుతో జూనియర్ అసిస్టెంట్ మృతి


జియావుద్దీన్ (ఫైల్)

గరిడేపల్లి: గరిడేపల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జూనియర్ అసిస్టెంట్ జియావుద్దీన్(55) గురువారం విధి నిర్వహణలో ఉండగా గుండెపోటుతో మృతిచెందారు. ఆయన స్వస్థలం నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి కాగా.. అక్కడి నుంచి ఆయన బదిలీపై గరిడేపల్లికి వచ్చి అద్దె ఇంట్లో ఉంటూ గత మూడేళ్లుగా ఇక్కడ పనిచేస్తున్నారు. జియావుద్దీన్ మృతి పట్ల పాఠశాల సిబ్బంది సంతాపం వ్యక్తం చేశారు.

అడ్డంకులు వచ్చినా ఆగేది లేదు..

చిట్యాల: వినాయకచవితికి హైదరాబాద్ నుంచి భారీ గణపతి విగ్రహాలను పెద్దఎత్తున వాహనాల్లో మండపాలకు తరలిస్తున్నారు. హైదరాబాద్–విజయవాడ జాతీయ రహదారిపై చిట్యాల పట్టణ శివారులోని రైల్వే అండర్‌పాస్ ఎత్తు తక్కువగా ఉండడంతో వాహనాల్లో భారీ విగ్రహాలను తరలించడానికి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. దీంతో అండర్‌పాస్ అవతలివైపే వాహనాల్లో నుంచి విగ్రహాలను క్రేన్ సహాయంతో కిందకు దించి చక్రాలతో ట్రాలీలో విగ్రహాలను ఉంచి తాళ్ల సహాయంతో అండర్‌పాస్ కింద నుంచి ఇవతలి వైపు లాక్కొస్తున్నారు. అనంతరం క్రేన్ సహాయంతో మరలా విగ్రహాన్ని వాహనాల్లోకి ఎక్కించి తీసుకెళ్తున్నారు. ఈ క్రమంలో పలు విగ్రహాలు అండర్‌పాస్ బ్రిడ్జికి తగిలి ధ్వంసమవుతున్నాయి. అంతేకాకుండా విగ్రహాలను అండర్‌పాస్ కింద నుంచి తరలించే సమయంలో హైవేపై వచ్చే వాహనాలు ఆగిపోతుండడంతో ట్రాఫిక్ ఇబ్బందులు ఎదురవుతున్నాయి.


అండర్‌పాస్ కింది నుంచి విగ్రహాన్ని లాగుతున్న యువకులు


అండర్‌పాస్ నుంచి బయటకు వచ్చిన భారీ గణనాథుడు


క్రేన్‌తో విగ్రహాన్ని వాహనంలోకి ఎక్కిస్తున్న యువకులు

వచ్చే నెలలో చేనేత రుణమాఫీ

- రాష్ట్ర చేనేత, జౌళిశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్


పోచంపల్లి ప్రొడ్యూసర్ కంపెనీ షోరూంను ప్రారంభిస్తున్న శైలజా రామయ్యర్ తదితరులు

భూదాన్‌పోచంపల్లి: లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ పూర్తికాగానే వచ్చే నెలలో చేనేత కార్మికుల ఖాతాల్లో చేనేత రుణమాఫీ డబ్బులు జమవుతాయని రాష్ట్ర చేనేత, జౌళిశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్ తెలిపారు. భూదాన్‌పోచంపల్లిలో కేంద్ర ప్రభుత్వ సహకారంతో మాస్టర్ వీవర్, నేషనల్ మెరిట్ అవార్డు గ్రహీత తడక రమేష్ ఏర్పాటుచేసిన పోచంపల్లి ప్రొడ్యూసర్ కంపెనీ షోరూంను వీవర్స్ సర్వీస్ సెంటర్ రీజినల్ డైరెక్టర్ అరుణ్‌కుమార్‌తో కలిసి గురువారం ఆమె ప్రారంభించారు. అనంతరం శైలజా రామయ్యర్ మాట్లాడుతూ.. ప్రస్తుతం చేనేత రుణమాఫీ లబ్ధిదారుల ఎంపిక జరుగుతుందని, కొన్ని జిల్లాల్లో జిల్లాస్థాయి బ్యాంకర్ల తీర్మానాలు పూర్తి కాలేదన్నారు. జిల్లాల వారీగా వచ్చిన బ్యాంకర్ల తీర్మానాలు రాష్ట్రస్థాయిలో పూర్తిచేసి రుణమాఫీ చేస్తామని చెప్పారు. త్రిఫ్ట్ పథకంలో కొత్త పేర్లు మార్పులు, చేర్పులతో కాస్త ఆలస్యమైందని, జూన్ నెలకు సంబంధించి రూ.7 కోట్లు మంజూరయ్యాయని తెలిపారు. టెస్కో కొనుగోలు చేసిన పోచంపల్లి హ్యాండ్లూమ్ పార్కులో నెల రోజుల్లో నేచురల్ డై యూనిట్‌ను ప్రారంభించనున్నామని పేర్కొన్నారు. పర్యావరణహితమైన నేచురల్ డై విధానం అందుబాటులోకి వస్తే పోచంపల్లి ఇక్కత్‌కు మరింత గుర్తింపువస్తుందని అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఐఐహెచ్‌టీని పోచంపల్లిలోనే ఏర్పాటు చేయాలని ఆదేశించారని, శిథిలావస్థకు చేరిన హ్యాండ్లూమ్ పార్కును పునర్నిర్మించి వచ్చే రెండేళ్లలో ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీని ఇక్కడే ఏర్పాటు చేస్తామని తెలిపారు. ప్రస్తుతం తాత్కాలికంగా ఐఐహెచ్‌టీని హైదరాబాద్‌లో నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. పోచంపల్లి ప్రొడ్యూసర్ కంపెనీ తెలంగాణలోనే మొదటి పైలెట్ ప్రాజెక్ట్ అని అన్నారు. చేనేత వస్త్రోత్పత్తులు, ఉపాధి, మార్కెటింగ్ అవకాశాలను పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రొడ్యూసర్ కంపెనీలను ప్రోత్సహిస్తోందని అన్నారు. షోరూమ్‌లో తెలంగాణలోని పోచంపల్లి ఇక్కత్, గద్వాల, సిద్దిపేట గొల్లభామ వస్త్రాలతో పాటు దేశంలో పేరెన్నికగన్న అనేక వస్త్రాల వెరైటీలను అందుబాటులో ఉంచడం అభినందనీయమన్నారు. తెలంగాణ ప్రభుత్వం కూడా డూప్లికేట్ చేనేత వస్త్రాలను అరికట్టేందుకు తెలంగాణ అథెంటిక్ లోగోలను అందజేస్తుందని, ఈ లోగోలను అతికించడం ద్వారా చేనేత వస్త్రాల నాణ్యత, వినియోగదారులకు నమ్మకం పెరిగి కొనుగోళ్లు పెరిగే అవకాశం ఉందన్నారు.

62 మంది అవార్డు గ్రహీతలకు పింఛన్లు మంజూరు..

65 సంవత్సరాలు దాటి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ అవార్డు గ్రహీతలకు నెలకు రూ.8వేలు పింఛన్ ఇస్తున్నామని, ఈ సంవత్సరం రాష్ట్రం నుంచి 62 మందికి పింఛన్ మంజూరైందని వీవర్స్ సర్వీస్ సెంటర్ రీజినల్ డైరెక్టర్ అరుణ్‌కుమార్ అన్నారు. అవార్డు గ్రహీతల పిల్లలు హ్యాండ్లూమ్‌కు సంబంధించి కోర్సులు అభ్యసిస్తే వారికి ఫీజు రీయింబర్స్‌మెంట్‌తో పాటు నెలకు రూ.5వేల స్కాలర్‌షిప్‌ను కేంద్ర ప్రభుత్వం అందజేస్తుందన్నారు. అంతేకాక 90శాతం సబ్సిడీతో ఎలక్ట్రానిక్ జకాట్ మిషన్లు, మగ్గాలు, ఆసు యంత్రాలు, హ్యాండ్లూమ్ ఎక్విప్‌మెంట్స్ అందజేస్తున్నామని పేర్కొన్నారు. ఈ పైలట్ ప్రాజెక్ట్ విజయవంతమైతే రాష్ట్రంలో మరో 42 షోరూలు ఏర్పాటు చేసేందుకు కేంద్రం సుముఖతతో ఉందని తెలిపారు. ఇప్పటివరకు ఉమ్మడి జిల్లా నుంచి ప్రొడ్యూసర్ కంపెనీ ద్వారా 12మంది చేనేత కళాకారులను విదేశాలకు పంపించి అక్కడ ఎగ్జిబిషన్లు ఏర్పాటు చేసి మార్కెటింగ్ సదుపాయం కల్పించామని పేర్కొన్నారు. కొత్తగా బున్‌కర్ దీదీ పథకం కింద మహిళా చేనేత కార్మికులకు ముద్ర రుణాలు ఇప్పించడంతో పాటు వారికి నూలు అందించడం, మార్కెటింగ్ సదుపాయాలను కల్పిస్తున్నామన్నారు. చేనేత కార్మికుల వార్షిక ఆదాయం రూ.10లక్షలకు పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం పైలెట్ ప్రాజెక్ట్ కింద తెలంగాణను ఎంపిక చేయగా.. అందులో ఉమ్మడి జిల్లాను ఎంపిక చేశామని త్వరలో ఆ పథకాన్ని అమలు చేయనున్నామని వెల్లడించారు.

పోచంపల్లిలో ఉత్సవాలు నిర్వహించాలని వినతి

యునెస్కో చేత అంతర్జాతీయ అవార్డు పొందిన పోచంపల్లిలో ఉత్సవాలను నిర్వహించాలని, పోచంపల్లిలో నూలు డిపో ఏర్పాటు చేసి కేంద్రం ఇచ్చే సబ్సిడీని అమలు చేయాలని పోచంపల్లికి చెందిన చేనేత నాయకులు తడక వెంకటేశం తదితరులు ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. దీనిపై ఆమె సానుకూలంగా స్పందిస్తూ వెంటనే ఉత్సవాల డీపీఆర్ ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా చేనేత, జౌళిశాఖ ఏడీ శ్రీనివాస్‌రావు, చౌటుప్పల్ ఆర్డీఓ శేఖర్‌రెడ్డి, తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి, ఆర్‌ఐ వెంకట్‌రెడ్డి, డీఓ రాజేశ్వర్‌రెడ్డి, మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మిత్రుడి కోసం కాలిఫోర్నియా నుంచి కోదాడకు..

- 30 ఏళ్ల తర్వాత స్నేహితుడిని కలుసుకున్న ఎన్ఆర్ఐ


పశు ఔషధ బ్యాంకుకు విరాళం అందజేస్తున్న ఎన్ఆర్ఐ సుధాకర్, చిత్రంలో పెంటయ్య

కోదాడరూరల్: తన మిత్రుడు మూగజీవాలకు చేస్తున్న వైద్య సేవలను సోషల్ మీడియాలో చూసి అమెరికాలోని కాలిఫోర్నియా నుంచి కోదాడకు వచ్చి ఆశ్చర్యానికి గురిచేశాడు ఓ ఎన్ఆర్ఐ. వివరాలు.. కోదాడ ప్రాంతీయ పశువైద్యశాలలో అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న డాక్టర్ పి. పెంటయ్య, హైదరాబాద్‌కు చెందిన డాక్టర్ చప్పిడి సుధాకర్ 30 ఏళ్ల కిందట హైదరాబాద్‌లోని పశువైద్య కళాశాలలో కలిసి చదువుకున్నారు. చదువు పూర్తయిన తర్వాత పెంటయ్య కోదాడ ప్రాంతంలో పశువైద్యాధికారిగా పనిచేస్తుండగా.. సుధాకర్ ఉన్నత చదువుల కోసం అమెరికాకు వెళ్లి అక్కడే కాలిఫోర్నియాలో స్థిరపడ్డారు. డాక్టర్ పెంటయ్య కోదాడ పశువైద్యశాలలో రైతులకు ఉపయోగపడేలా పశుఔషధ బ్యాంకును ఏర్పాటు చేసి మూగజీవాలకు చేస్తున్న వైద్య సేవలను కాలిఫోర్నియాలో ఉంటున్న అతడి స్నేహితుడు సుధాకర్ సోషల్ మీడియాలో చూశాడు. పెంటయ్య ఫోన్ నంబర్ తీసుకున్న సుధాకర్ త్వరలో కలుస్తానని అడ్రస్, లోకేషన్ షేర్ చేయమని చెప్పాడు. కాలిఫోర్నియా నుంచి హైదరాబాద్‌కు వచ్చిన సుధాకర్ బుధవారం కోదాడకు వచ్చి తన మిత్రుడు పెంటయ్యను కలిసి సర్‌ప్రైజ్ ఇచ్చాడు. చాలా ఏళ్ల తర్వాత కలుసుకున్న ఇద్దరు స్నేహితులు ఆనందంలో మునిపోయారు. అనంతరం పశుఔషధ బ్యాంక్‌కు రివాల్వింగ్ ఫండ్ కింద రూ.20వేలు విరాళం అందజేశారు. ఈ సందర్భంగా సుధాకర్‌తో పలు రకాల పండ్ల మొక్కలను నాటించారు.

అత్తింటి వేధింపులతో వివాహిత ఆత్మహత్య


ప్రత్యూష (ఫైల్)

మరిపెడ రూరల్: అత్తింటి వేధింపులతో వివాహిత ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం ఎల్లంపేటలో బుధవారం చోటు చేసుకోగా ఆలస్యంగా గురువారం వెలుగుచూసింది. స్థానికులు, బంధువుల కథనం ప్రకారం.. ఎల్లంపేట గ్రామానికి చెందిన పాక వెంకన్న, ఉమ దంపతులకు ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. చిన్న కుమార్తె ప్రత్యూషను (24) ఐదేళ్ల క్రితం సూర్యాపేట జిల్లా మోతె మండలం జగ్గుగూడెం గ్రామానికి చెందిన పెరుగు పరశురాములుకు ఇచ్చి వివాహం చేశారు. కట్నకానుకల కింద ఇద్దరు కుమార్తెలకు చెరో ఒకరం వ్యవసాయ భూమి రాసి ఇచ్చారు. ప్రత్యూష, పరశురాములు దంపతుల దాంపత్య జీవితం కొంతకాలం సజావుగా కొనసాగింది. ఈ క్రమంలో ప్రత్యూష అత్తగారి ఇంటి వద్ద మరిది పెత్తనంతో ఆ ఉమ్మడి కుటుంబంలో గొడవలు చోటు చేసుకున్నాయి. ఆ గొడవలు పెద్దగా మారి ప్రత్యూషను కట్నం కింద ఇచ్చిన భూమి అమ్మి డబ్బులు తీసుకురావాలని అత్తింటి వారు వేధించడం మొదలుపెట్టారు. ఈ విషయంలో ఇటీవల అత్తమామ, మరిది, భర్త కలిసి ప్రత్యూషపై దాడి చేశారు. అనంతరం ప్రత్యూషను భర్త పరశురాములు పది రోజుల క్రితం తల్లిగారి ఊరైన ఎల్లంపేటలో బలవంతంగా వదిలి వెళ్లాడు. ఎంతకూ తీసుకెళ్లకపోవడంతో ప్రత్యూష ఫోన్‌లో భర్తను నిలదీసింది. దీంతో ‘నాకు, నీకు సంబంధం లేదు.. నీ చావు నువ్వు చావు’ అని భర్త తెగేసి చెప్పాడు. మనస్తాపానికి గురైన ప్రత్యూష ఈ నెల 19న ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యాయత్నానికి యత్నించగా పక్కింటి వారు చూసి రక్షించే ప్రయత్నం చేశారు. కొన ఊపిరితో ఉన్న ఆమెను కుటుంబ సభ్యులు 108 వాహనంలో ఖమ్మంలోని ఓ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఈ నెల 20న మృతిచెందింది. మృతురాలి తండ్రి వెంకన్న ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు. మృతురాలికి 11 నెలల కుమార్తె ఉంది.

సాంకేతిక కోర్సుల్లో ఉచిత శిక్షణ

- శిక్షణ కాలంలో ఉచిత హాస్టల్ వసతి

భూదాన్‌పోచంపల్లి: యాదాద్రి భువనగిరి జిల్లా భూదాన్‌పోచంపల్లి మండలంలోని జలాల్‌పురంలో గల స్వామి రామానందతీర్థ గ్రామీణ సంస్థలో దీన్ దయాళ్ ఉపాధ్యాయ గ్రామీణ కౌశల్య యోజన పథకం కింద తెలంగాణలోని నిరుద్యోగ యువతకు ఉపాధి ఆధారిత సాంకేతిక కోర్సులలో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు సంస్థ చైర్మన్ ఎస్. కిషోర్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మూడున్నర నెలల కాల వ్యవధి గల అకౌంట్ అసిస్టెంట్ (ట్యాలీ) కోర్సుకు బీకాం, కంప్యూటర్ హార్డ్‌వేర్ అసిస్టెంట్ కోర్సుకు ఇంటర్మీడియట్, ఆటోమొబైల్ టూవీలర్ కోర్సుకు పదో తరగతి, సోలార్ సిస్టమ్ ఇన్‌స్టాలేషన్ అండ్ సర్వీస్ కోర్సుకు పదో తరగతి విద్యార్హత కల్గి ఉండాలని అన్నారు. అభ్యర్థులు 18 నుంచి 30 సంవత్సరాల వయస్సు కల్గి ఉండాలని సూచించారు. శిక్షణా కాలంలో ఉచిత భోజనం, హాస్టల్ వసతి కల్పించబడుతుందని పేర్కొన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న అభ్యర్థులకు ఉద్యోగ అవకాశం కల్పిస్తామని చెప్పారు. ఆసక్తి కల్గిన అభ్యర్థులు తమ విద్యార్హతల సర్టిఫికెట్లు, ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోతో సెప్టెంబర్ 1న సంస్థలో నిర్వహించే కౌన్సిలింగ్‌కు హాజరుకావాలని సూచించారు. మరిన్ని వివరాలకు 91339 08000, 91339 08111 నంబర్లను సంప్రదించాలన్నారు.

మనస్తాపంతో యువకుడి బలవన్మరణం


రాము (ఫైల్)

మోతె: బంధువు సూటిపోటి మాటలతో మనస్తాపం చెందిన యువకుడు గడ్డిమందు తాగగా.. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. వివరాలు.. మోతె మండలం విభళాపురం గ్రామానికి చెందిన నిమ్మల పెదలచ్చయ్య, లచ్చమ్మ దంపతులకు నలుగురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు సంతానం. అందరికీ వివాహాలు చేశారు. నలుగురు కుమారులకు ఒక్కొక్కరికి ఆరెకరాల వ్యవసాయ భూమి, 3 గుంటల ఇంటి స్థలం పంచి ఇచ్చారు. వృద్ధాప్యంలో ఉన్న తమకు కుమారులు పట్టించుకోవడం లేదని పెదలచ్చయ్య, లచ్చమ్మ దంపతులు పలుమార్లు తహసీల్దార్, ఆర్డీఓకు ఫిర్యాదు చేశారు. సమస్యకు పరిష్కారం లభించకపోవడంతో సోమవారం ఆ వృద్ధ దంపతులు తమ మనమడు నిమ్మల రాము(22)తో కలిసి సూర్యాపేట కలెక్టరేట్‌లో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ విషయం సోషల్ మీడియాలో వైరల్ కావడంతో.. వారి బంధువు నిమ్మల రాజశేఖర్ సూటిపోటి మాటలు అనడంతో మనస్తాపానికి గురైన రాము మంగళవారం గడ్డి మందు తాగాడు. కుటుంబ సభ్యులు సూర్యాపేటలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. మృతుడి తండ్రి శ్రీను ఫిర్యాదు మేరకు నిమ్మల రాజశేఖర్, వృద్ధ దంపతులపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ అజయ్‌కుమార్ తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి

తిరుమలగిరి(తుంగతుర్తి): ఇంట్లో నిద్రించిన మహిళ అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. ఈ ఘటన తిరుమలగిరి మండలం గుండెపురి గ్రామంలో గురువారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గుండెపురి గ్రామానికి చెందిన పాలకుర్తి కౌశమ్మ(60)కు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె సంతానం. కుమారులు ఇతర ప్రాంతాల్లో ఉండగా.. ఆమె ఒంటరిగా గ్రామంలోనే నివాసముంటోంది. బుధవారం రాత్రి గ్రామంలో జరిగిన పోలీస్ భరోసా కార్యక్రమానికి ఆమె హాజరై ఇంటికి వెళ్లి నిద్రించింది. రోజుమాదిరిగానే గురువారం ఉదయం పాల కోసం ఇంటి పక్కన వారు పిలువగా ఆమె బయటకు రాలేదు. ఇంట్లోకి వెళ్లి చూడగా మంచంపై విగతజీవిగా పడి ఉంది. ఆమె మెడపై ఉన్న బంగారు గొలుసు కనిపించకపోవడంతో కుటుంబ సభ్యులు అనుమానం వ్యక్తం చేస్తూ స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తుంగతుర్తి ఆస్పత్రికి తరలించారు.

బీఎస్ఎన్ఎల్ ఫ్రీడమ్ ప్లాన్‌కు ప్రజాదరణ

రామగిరి(నల్లగొండ): స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని బీఎస్ఎన్ఎల్ ప్రవేశపెట్టిన ఫ్రీడమ్ ప్లాన్‌కు(రూ.1కి సిమ్) వినియోగదారుల నుంచి మంచి ఆదరణ లభించిందని బీఎస్ఎన్ఎల్ ఉమ్మడి జిల్లా ప్రిన్సిపల్ జనరల్ మేనేజర్ పి. వెంకటేశం అన్నారు. కేవలం ఒక్క రూపాయితో 30రోజుల పాటు అపరిమిత వాయిస్ కాల్స్, రోజుకు 2 జీబీ డేటాతో పాటు రోజుకు 100 మేసేజ్‌లు పొందవచ్చన్నారు. ఈ పథకం ఆగస్టు 31 వరకు అమలులో ఉంటుందని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి


సోమనాథ్ ఉత్తమ్ గారడి మృతదేహం

మిర్యాలగూడ టౌన్: గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన బుధవారం రాత్రి మిర్యాలగూడ మండలం కొత్తగూడెం బస్టాండ్ వద్ద జరిగింది. మిర్యాలగూడ రూరల్–2 ఎస్ఐ సైదులు తెలిపిన వివరాల ప్రకారం.. మహారాష్ట్రకు చెందిన సోమనాథ్ ఉత్తమ్ గారడి (27) దామరచర్లలోని యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌లో సూపర్‌వైజర్‌గా గత రెండేళ్లుగా పనిచేస్తున్నాడు. అనారోగ్యంతో బాధపడుతున్న అతడు బుధవారం రాత్రి మందుల కోసం మిర్యాలగూడకు వస్తుండగా.. మిర్యాలగూడ మండలం కొత్తగూడెం బస్టాండ్ వద్ద గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన అతడిని స్థానికులు 108 వాహనంలో మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. మృతుడి బంధువు సంతోష్ గురువారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించినట్లు పేర్కొన్నారు.

పులిచింతల నుంచి 13 గేట్ల ద్వారా నీటి విడుదల



మేళ్లచెరువు: చింతలపాలెం మండలంలోని పులిచింతల ప్రాజెక్టుకు గురువారం 4,28,513 క్యూసెక్కుల వరద నీరు వస్తుండగా.. 13 గేట్లను నాలుగున్నర మీటర్ల మేర ఎత్తి 4,13,205 క్యూసెక్కుల నీటిని అధికారులు దిగువకు వదులుతున్నారు. టీజీ జెన్‌కో 16,600 క్యూసెక్కుల నీటిని ఉపయోగిస్తూ నాలుగు యూనిట్ల ద్వారా 105మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

విద్యార్థి అదృశ్యం.. కేసు నమోదు

భువనగిరి: భువనగిరి మండలం అనంతారం గ్రామ పరిధిలోని శ్రీవాగ్దేవి డిఫెన్స్ కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతున్న విద్యార్థి కళాశాల నుంచి అదృశ్యమయ్యాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌లోని ఓల్డ్ బేగంపేటకు చెందిన రాశి రితీష్‌యాదవ్ బుధవారం సాయంత్రం ఎవరికీ చెప్పకుండా శ్రీవాగ్దేవి డిఫెన్స్ కళాశాల నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. బంధువులు, తెలిసిన వారి ఇళ్లలో ఎంత వెతికినా అతడి ఆచూకీ లభించకపోవడంతో గురువారం తల్లిదండ్రులు భువనగిరి రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు భువనగిరి రూరల్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ అనిల్‌కుమార్ తెలిపారు.

వరిలో కొత్త రకం కలుపు మొక్కలు

- పొలం చెడగొట్టి మళ్లీ దమ్ము చేస్తున్న రైతులు
- వ్యవసాయాధికారులు సూచనలు ఇవ్వాలని కోరుతున్న అన్నదాతలు


చిలుకూరులో పొలాన్ని చెడగొట్టి మళ్లీ దమ్ము చేస్తున్న రైతు

పాడిపంట

చిలుకూరు: ఈ ఏడాది వెదజల్లే పద్ధతిలో వరి సాగుచేసిన రైతులకు కలుపు మొక్కలు చుక్కలు చూపిస్తున్నాయి. గత కొన్నిరోజులుగా కురుస్తున్న వర్షాలకు పొలాల్లో వివిధ రకాల కలుపు మొక్కలు విపరీతంగా పెరిగాయి. ఏ మందులు పిచికారీ చేసినా కలుపు మొక్కలు చనిపోయే పరిస్థితి లేదు. వరి విత్తనాలు వెదజల్లిన 15 నుంచి 20 రోజుల వ్యవధిలో రైతులు ఒకసారి కలుపు మందులు పిచికారీ చేశారు. అయినా కలుపు మొక్కలు చనిపోలేదు. మరోసారి పిచికారీ చేసినా ఎలాంటి ప్రయోజనం కనిపించలేదని రైతులు చెబుతున్నారు. గతంలో లేని విధంగా ఈసారి కొత్త రకం కలుపు మొక్కలు పుట్టుకొస్తున్నాయని రైతులు అంటున్నారు.

కొత్త రకం కలుపుతో తంటాలు

వెదజల్లే పద్ధతిలో సాగు చేసిన వరి పొలాలను ప్రారంభంలో ఆరబెట్టడం, నీళ్ల పెట్టడం చేయడం వలన సాధారణంగానే కలుపు మొక్కలు మొలకెత్తుతాయి. గతంలో తుంగ, వంజ, నక్కలతోకల గడ్డి, దారక లాంటి కలుపు మొక్కలు కనిపించగా.. మొదటి 20 రోజుల్లో మందులు పిచికారీ చేయడం వల్లన వాటిని నివారించేవారు. ఈ ఏడాది కొత్తగా నకిలి వరి, గోధుమ రంగులో వంజ, ఎర్ర, తెల్ల వంజలు మొలకెత్తాయని రైతులు వాపోతున్నారు. ఇవి ఏ మందులు కొట్టినా చనిపోవడం లేదని అంటున్నారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు వంజ రకం కలుపు విపరీతంగా పెరిగి అసలు వరి పైరు కనబడటం లేదని రైతులను ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గత్యంతరం లేక చిలుకూరులో కొంతమంది రైతులు 30 నుంచి 35 రోజుల క్రితం వెదల్లే పద్ధతిలో సాగు చేసిన పొలాలను ట్రాక్టర్‌తో దున్ని మళ్లీ నాట్లు వేస్తున్నారు. దీని వల్లన రైతులు ఒక్కో ఎకరానికి రూ. 20వేలకు పైగా నష్టపోతున్నారు. చిలుకూరు నుండి దూదియాతండా రోడ్డులో చాలా మంది రైతుల పరిస్థితి ఇలాగే ఉంది. చిలుకూరు మండల వ్యాప్తంగా 70 శాతం మంది రైతులు ఈ ఏడాడి వెదజల్లే పద్ధతిలోనే వరి సాగు చేశారు. ఇప్పటికైనా వ్యవసాయాధికారులు స్పందించి క్షేత్రస్థాయిలో పొలాలను పరిశీలించి సూచనలు ఇవ్వాలని రైతులు కోరుతున్నారు. నష్టపోయిన రైతులను గుర్తించి ఆదుకోవాలని వేడుకుంటున్నారు.

పొలం మొత్తం మళ్లీ దున్నిస్తున్నా



ఈ వెదజల్లే పద్ధతిలో వరి సాగు చేశాను. గతంలో మాదిరిగానే ఈసారి కూడా మొదటి 20 రోజులకు కలుపు మందులు పిచికారీ చేశా. అయినా అవి చనిపోలేదు. మళ్లీ వెంటనే రెండోసారి కూడా కలుపు మందులు పిచికారీ చేసినా ఫలితం లేదు. పొలంలో విపరీతంగా కొత్త రకం వంజ పుట్టింది. పొలం మొత్తం కమ్మేసింది. ఏమి చేయాలో అర్థంకాక పొలం మొత్తం మళ్లీ దమ్ము చేసి నాట్లు వేస్తున్నా.

– గుండు శ్రీను, కౌలు రైతు, చిలుకూరు